
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 6 ఏప్రిల్ 2025

సీతారాముల కల్యాణం చూతము రారండి..

నవమి వేడుకలకు ముస్తాబైన పందిళ్లు, ఆలయాలు



నరసరావుపేటలో పట్టాభిరామ స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన పందిరి



కళ్యాణం కోసం తలంబ్రాలు సిద్ధం చేస్తున్న భక్తులు

శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందు కు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్స వాన్ని నిర్వహించనున్నారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పల్లెలు, పట్టణాల్లో రాములోరి వేడు కల కోసం ప్రత్యేకం గా పందిళ్లు వేశారు. సీతారా ముల కల్యాణానికి భక్తులు తలం బ్రాలను సిద్ధం చేశా రు. జిల్లా కేంద్రా లైన నరసరావు పేట, బాపట్లతో పాటు గుంటూరు, తెనాలిలో నవమి వేడుకలకు భారీగా ఏర్పాట్లు జరిగాయి. - నరసరావుపేట

అకాల వర్షం.. నష్టం

- మధ్యాహ్నం వరకు మండిన ఎండ
- సాయంత్రం ఈదురుగాలులతో వాన



అకాల వర్షానికి గుంటూరు మిర్చి యార్డులో తడిసిన మిర్చి



పెదకూరపాడు: మిర్చిపై పట్టలు కప్పుతున్న రైతు



మధ్యాహ్నం వరకు ఎండ మండింది. ఉన్నట్లుండి సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. గుంటూరు, తెనాలి, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. అకాల వర్షంతో కల్లాల్లోని పంట దిగుబడులను రక్షించుకునేందుకు పట్టలతో రైతులు పొలాల బాట పట్టారు. గుంటూరు మిర్చియార్డులో మిర్చి వర్షార్పణమైంది. - గుంటూరు, పెదకూరపాడు

ఎన్నికలు జరగక.. నిధులు రాక

- నిధులు లేక గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- ఎన్నికలు నిర్వహిస్తేనే ఆర్థిక సంఘం నిధులంటున్న కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సమీప పంచాయతీలకు నాలుగేళ్ల క్రితం ఎన్నికలు జరిగి.. ఆర్థిక సంఘం నిధులతో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. పాలకవర్గాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీల్లో ఎన్నికలు జరగక ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. అయితే ఎన్నికలు జరగని ఫలితంగా ఆయా పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను ఆపేసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. కేంద్రం విడుదల చేస్తున్న ఆర్థిక సంఘం నిధులే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. అయితే పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులనూ నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గత ఏడాది అక్టోబ రులో 15వ ఆర్థిక సంఘం నిధులను కేం ద్రం విడుదల చేసింది. జనవరిలో రెండో విడత నిధులను విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 69 పంచాయతీ లు రెండు విడతల్లో సుమారు రూ.7 కోట్లు నిధులను చేజార్చుకున్నాయి. పాలక వర్గాలు ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఎన్నికల పై ఎప్పటికి దృష్టి సారిస్తుందో.. వాటికి ఎప్పుడు నిధులు వస్తాయో చూడాలి.

విలీనాలు.. వివాదాలు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీల సమీపం లోని పలు పంచాయతీలను విలీనం చేశారు. నరస రావుపేట మున్సిపాల్టీలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యల మందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల

రూ.7 కోట్లు కోల్పోయిన 69 పంచాయతీలు

పరిధి లోకి కొంత ప్రాంతాన్ని విలీనం చేశారు. పొన్నూరు మున్సిపాల్టీలో చింతలపూడి, కసుకర్రు, కట్టెంపూడి, ఆలూరు, పెదఇటికంపాడు, వడ్డెముక్కల పంచా యతీలను విలీనం చేశారు. బాపట్ల మున్సిపాల్టీలో అడ వి,



నరసరావుపేట మండలం లింగంగుంట్లలో కనీస వసతులు లేని గిరిజన కాలనీ

అడవివారిపాలెం, ఈస్ట్ బాపట్ల, కొండబొట్ల వారి పాలెం, మరుప్రోలువారిపాలెం, ముత్తాయపాలెం, పిన్ని బోయినవారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, తూర్పు పిన్న బోయినవారిపాలెం, వెస్ట్ బాపట్ల పంచాయతీలను విలీ నం చేశారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో దండ మూడి విలీనం చేశారు. గుంటూరు కార్పొ రేషన్‌లో చినపలకలూరు, లాల్‌పురం, మంగళగిరి మున్సిపాల్టీలో ఆత్మకూరు, బేతపూడి, చినకాకాని, చిన వడ్లపూడి, కాజ, వెంకటరెడ్డిపాలెం, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రాపురం, యర్రబాలెం పంచా యతీలను విలీనం చేశారు. తాడేపల్లి మున్సిపాల్టీలో చిర్రావూరు, గుండిమెడ, ఇప్ప టం, కొలనుకొండ, మెల్లం పూడి, పెనుమాక, ప్రాతూరు, ఉండవల్లి, వడ్డేశ్వరం పంచాయతీలను విలీనం చేశారు. రాజధాని అమరావ తిలో అబ్బరాజుపాలెం, అనంతవరం, బోరుపాలెం, దొండపాడు, హరిశ్చంద్రాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మల్కాపురం, మందడం, నెక్కల్లు, నేలపాడు, పెదపరిమి, రాయపూడి, శాఖమూరు పంచా యతీలను విలీనం చేశారు. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. అధికా రం అండతో అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి వారికి అనుకూలంగా మున్సి పాల్టీల్లో విలీనం చేశారు. విలీన ప్రక్రియపై అభ్యంతరా లు వచ్చినా అప్పట్లో అధికారులు లక్ష్య పెట్ట లేదు. ఫలితంగా పలువురు కోర్టులను ఆశ్రయిం చారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం వివా దాలను పరిష్కరించకుండా వదిలేసింది. కూట మి ప్రభుత్వంలో అయినా కోర్టులోని వివాదాలు పరిష్క రించి ఎన్నికలు నిర్వహిస్తారని ఆశించిన వారికి పది నెలలుగా నిరాశే ఎదు రైంది.

పల్లె పాలన.. ఆన్‌లైన్

- ఇక పంచాయతీల్లో అక్రమాలకు చెక్
- గ్రామాల్లో కార్యకలాపాలన్నీ డిజిటలైజేషన్
- కాగిత రహిత పాలనకు మూడు నెలల గడువు
- తొలివిడతలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95 కంప్యూటర్లు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలను దోచేశారు. పాలనలో పారదర్శకతకు పాతరేశారు. పన్నుల వసూళ్లు.. నిధుల ఖర్చులకు లెక్కాపత్రా లు లేకుండా మింగేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని కొన్ని పంచాయతీలు అక్రమాలకు కేంద్రాలుగా మార్చేశారు. పంచాయతీలను వేదికగా చేసుకుని వైసీపీ నేతాగణం అనేక అక్రమాలకు పాల్పడిన సంగతి తెలిసిందే. అటు నేతలు.. ఇటు అధికార యంత్రాంగం కలిసి పంచాయతీ లను నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితుల్లో అన్ని వ్యవస్థలను చక్క దిద్దే క్రమంలో కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో అక్రమాలపై దృష్టి పెట్టింది. అయితే దేనికీ లెక్కాపత్రం లేకపోవడం, కొన్ని రికార్డులు మాయం చేయడాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఇలాంటి అక్రమాలకు విరుగుడుగా గ్రామ పాలనను పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా పల్లె పాలనా కార్యకలాపాలను డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా జరిగేలా ఆదేశాలు జారీ చేసింది. పన్నుల వసూలు మొదలుకుని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీతభ త్యాలు, నిధుల ఖర్చు, ఆర్థిక సంఘం నిధులు, గ్రామాభి వృద్ధికి దాతల విరాళాలు.. ఇలా అన్నింటినీ ఆన్‌లైన్ ద్వారానే చేయాలని తద్వారా పారదర్శకత తీసుకు రావాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇలాంటి ఒక వ్యవస్థ లేకపోవడం వల్లే పంచాయతీలను వైసీపీ నేతలు నిలువునా దోచేశారని, భవిష్యత్తులో గ్రామాల్లో ఖర్చు పెట్టే ప్రతి పైసాకు లెక్క ఉండటంతో పాటు గ్రామస్థులకు ఆన్‌లైన్‌లో అవి అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రికార్డుల డి జిటలైజేషన్ ద్వారా గత ప్రభుత్వం లో జరిగిన అవకతవకలపై స్పష్ట త వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లా వ్యాప్తంగా దాదాపు 55 పంచాయతీల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు నిర్ధారించి విచారణ చేస్తున్నారు. ఆన్‌లైన్ చేయడం ద్వారా అవినీతి నిగ్గు తేల్చడం కూడా సులభతరం అవుతుం దనేది ప్రభుత్వం ఉద్దేశంగా ఉంది.

పంచాయతీ పోర్టల్ ద్వారా..

పన్నుల వసూళ్లకు పంచాయతీల్లో స్వర్ణ పోర్టల్‌ను ఇప్పటికే ప్రవేశపెట్టిన ప్రభుత్వం దాని ద్వారానే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. క్యూ ఆర్ కోడ్ స్కానర్ల ద్వారా సిబ్బంది పన్నులు వసూలు చేస్తున్నారు. పంచాయతీల్లోని నిధుల నిల్వతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ల గణాంకాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. గ్రామాభివృద్ధికి ఖర్చు చేసే నిధులు, పనులు ఏ స్థాయిలో ఉన్నాయి ఇలా ప్రతి అంశాన్ని ఆన్‌లైన్ చేయాల్సిందే. ఉద్యోగుల చేతివాటానికి ఏ మాత్రం అవకాశం లేకుండా పం చాయతీల్లో జరిగే కార్య కలాపాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు తేవడానికి ప్రభు త్వం చర్యలు చేపడుతోంది.

పంచాయతీల వారీగా నివేదికలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 459 పంచాయతీలు ఉండగా ఉమ్మడి గుంటూరు జిల్లా వరకు చూస్తే 1012 పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల్లో కాగిత రహిత పాలన శ్రీకారానికి మూడు నెలలు మాత్రమే ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ క్రమంలో ఏయే పంచాయతీల్లో కంప్యూటర్ల కొరత ఉందనే అంశంతో పాటు ఆన్‌లైన్ డేటాను పకడ్బందీగా నిర్వహించ డానికి నైపుణ్యం కలిగిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అనే సవివర నివేదికలను పంపాలని పంచాయతీ విభా గాన్ని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్ర స్థాయిల్లో పరిశీలన చేపట్టి ప్రాథమికంగా సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 450 పంచా యతీల్లో కంప్యూటర్ల కొరత ఉందని నివేదిక ఇచ్చారు. స్కిల్ సిబ్బంది అవసరం 300 వరకు ఉంటుందనే ప్రతిపాదనలను యంత్రాంగం పంపింది. ఈ పరిస్థితుల్లో తొలి విడతగా 95 కంప్యూటర్లను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీలకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దశల వారీగా అన్ని పంచాయతీలకు కావాల్సిన సాంకేతిక సహాయంతో పాటు సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

కృష్ణానదిపై.. మరో వంతెన

మాదిపాడు-ముక్త్యాల మధ్య నిర్మాణం

- నాబార్డు రూ60.54 కోట్లు మంజూరు
- క్షేత్రస్థాయిలో మొదలైన పనులు

అమరావతికి దేశంలోని అన్ని ప్రాంతాలతో సంబంధాలు ఉండేలా అద్భుతమైన రోడ్ నెట్‌వర్కును ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా కృష్ణానదిపై అరడజనుకు పైగా వంతెనలను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అవి కాకుండా ఏడో వంతెనను కూడా అందుబాటులోకి తెస్తున్నారు. వంతెన పనులను ఇప్పటికే ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ముక్త్యాల-ఉమ్మడి గుంటూరు జిల్లా మాదిపాడు మధ్య కృష్ణానదిపై రూ.60.54 కోట్లతో మూడు వరుసల వంతెన నిర్మాణ పనులను తాజాగా ఆరంభించారు. నాబార్డు సాయంతో ఈ వంతెనను ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు.



మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై వంతెనను నిర్మించనున్న ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

దేశంలో ఏ రాజధానికి లేనట్లుగా రహదారుల కనెక్టివిటీ అమరావతి నగరానికే సొంతమవుతుంది. రాజధాని అమరావతికి చెన్నై, కలకత్తా, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల నుంచి కనెక్టివిటీ ఉండేలా అమరావతి చుట్టూ రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటివరకు కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధిల రూపంలో రెండు బ్రిడ్జిలు ఉండగా మరో అరడజను వంతెనలను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. వీటిలో విజయవాడ పశ్చిమ బైపాస్ రూపంలో ఓ వంతెన మరికొద్ది రోజుల్లోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. మరో వంతెనను ఉమ్మడి గుంటూరు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు-ఉమ్మడి కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల మధ్య నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జితో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల నడుమ అమరావతి సమీప ప్రాంతంలో ఏడో బ్రిడ్జి ఏర్పాటవుతున్నట్లే.



నది మధ్య పిల్లర్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రెండున్నర దశాబ్దాల కల

మాదిపాడు-ముక్త్యాల మధ్య కృష్ణానదిపై బ్రిడ్జిని నిర్మించాలన్నది ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల చిరకాల కోరిక. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దానిపై రోడ్డు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటు పల్నాడు, అటు ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు సిమెంటు, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. మధ్యలో నది ఉండడంతో రెండు జిల్లాల నడుమ అటుఇటూ రవాణాకు 70కి.మీలు అదనమై పోతుంది. ప్రస్తుతం పలువురు బల్లకట్టు, ఇతరాత్ర పడవలపై ప్రమాదకరరీతిలో ప్రయాణిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే రవాణా ఖర్చు తగ్గడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు. పైగా గుంటూరు నుంచి హైదరాబాద్‌కు రాకపోకలను సాగించేవారికి 50 కిలోమీటర్ల వరకు దూరం తగ్గుతుంది.

నది వెడల్పు చాలా తక్కువ

కృష్ణానది రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా మాదిపాడు-ముక్త్యాల నడుమ కేవలం అర కిలోమీటరు వెడల్పుతో ప్రవహిస్తుంది. పైగా బ్రిడ్జి ప్రతిపాదిత స్థలంలో నది వంపు తిరుగుతున్నట్లు ఉండటంతో (మిగతా 8వ పేజీలో)

వందకు చేరిన టీడీపీ శాశ్వత సభ్యత్వాలు

రాష్ట్రస్థాయిలో చిలకలూరిపేటకు మూడోస్థానం : ప్రత్తిపాటి

కాకుమాను సాగునీటి వ్యవస్థకు మహర్దశ

- రూ.10 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన ప్రసాద్ సీడ్స్ అధినేత
- సీఎం పిలుపుతో పీ4లో భాగస్వామి అయ్యేందుకు నిర్ణయం

సిమెంట్ ఫ్యాక్టరీలకు 'కాసు' వత్తాసు

బాధిత గ్రామాల రైతుల ఆరోపణ

6

ఎన్ఐ పనుల కారణంగా రైళ్లపై ప్రభావం

జగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులు

నరసరావుపేటలో ర్యాలీ.. పాల్గొన్న కలెక్టర్



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నర సరావుపేటలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ అరుణ్‌బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రారంభమైన ర్యాలీలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

నరసరావుపేట లీగల్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ కంచి శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 47 ఏళ్ల లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన జగ్జీవన్‌రామ్ వివిధ మంత్రి పదవులతో పాటు ఉప ప్రధానిగా కూడా వ్యవహరించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడుగా పేరు గాంచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సంతోష్, సత్తిబాబు, ఎస్‌బీ సీఐలు సురేష్‌బాబు, శరత్ బాబు, ఆర్ఐలు రాజా, కృష్ణ, గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఎన్ఐ పనుల కారణంగా రైళ్లపై ప్రభావం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నంబూరు రైల్వేస్టేషన్‌లో నాన్ ఇంటర్ (ఎన్ఐ) లాకింగ్ పనుల కారణంగా నాలుగు రైళ్లపై ప్రభావం పడుతుందని రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67229 విజయవాడ - గుంటూరు ప్యాసింజర్ రైలు ఈనెల 7, 8 తేదీల్లో రద్దు చేశామన్నారు. నంబరు. 67223 గుంటూరు - రేపల్లె ప్యాసింజర్ పైన పేర్కొన్న రెండు తేదీల్లో తెనాలి-రేపల్లె, రేపల్లె-తెనాలి మధ్యన మాత్రమే ప్రయాణిస్తుందన్నారు. గుంటూరు-తెనాలి మధ్యన ఈ రైలు సర్వీసు ఉండదని చెప్పారు. నంబరు. 12796 లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీన గుంటూరులో 50 నిమిషాల పాటు నిలిపేయడం జరుగుతుందన్నారు. అలానే నంబరు. 67228 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ ఈ నెల 8వ తేదీన గంటపాటు గుంటూరులో నిలిపేస్తామన్నారు. ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని సీనియర్ డీసీఎం విజ్ఞప్తి చేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుండయ్య తోటలో గేరా రాజేష్ (25) అనే యువకుడు తన గృహంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం మూడు రోజుల క్రితం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని రాజేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లుగా అర్బన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. దీంతో అర్బన్ సీఐ పీ రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అయితే అప్పుల సమస్యతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● ఏపీ రోడ్‌సేఫ్టీ డీఐజీ సీహెచ్ విజయారావు ● ఏఎన్‌యూలో ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీ రోడ్ సేఫ్టీ డీఐజీ సీహెచ్ విజయారావు

పెదకాకాని, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అనుకున్న లక్ష్య సాధనలో బాబూ జగ్జీవన్‌రామ్‌ను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ రోడ్‌సేఫ్టీ విభాగ డీఐజీ సీహెచ్ విజయారావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయారావు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ చిననాటి నుంచే జగ్జీవన్‌రామ్ అంకితభావంతో నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని వాటిని పరిపూర్ణంగా సాధించారన్నారు. అతి సాధారణ స్థాయి నుంచి అసాధారణ స్థాయికి చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించారని తెలిపారు. పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందనే దానికి జగ్జీవన్‌రామ్ నిదర్శనమన్నారు. వీసీ ఆచార్య కే గంగాధరరావు ప్రసంగిస్తూ జగ్జీవన్‌రామ్ చేపట్టిన సంస్కరణల ఫలాలు నేటికీ మనం అనుభవిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రిగా ఆయన మేథస్సు చూపడం వల్లనే అప్పుడు దేశం ఆహార కొరతను అధిగ మించిందన్నారు. పాలన, రాజకీయ రంగాలలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్, పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల సేవలు, ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అధ్యయ నకేంద్రం డైరెక్టర్ ఆచార్య వీజే రత్నాకర్, అంబేడ్కర్, పూలే అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచా ర్య వై అశోక్ కుమార్, ఆచార్య ఎం త్రిమూర్తిరావు, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య పీ బ్రహ్మజీరావు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు, బాలుర వసతి గృహాల వార్డెన్ ఆచార్య మల్లిఖార్జున ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య కృష్ణారావు, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ ప్రసాద్, జే శ్రీనివాసరావు, నాయకులు ఎన్ నాగేశ్వరరావు, ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్సీ యూనియన్ అధ్యక్షులు కే కోటేశ్వరరావు, యూనివర్సిటీ ఇంజనీర్ డీ కుమార్ రాజు, ఎంఎస్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కే ప్రఫుల్ కుమార్, డీ నరేంద్ర, నాయకులు కోటయ్య, బీసీ సంఘ నాయకులు బీ కోటేశ్వరరావు యాదవ్, డీఈ కే సుబ్బారావు, విద్యార్థి సంఘ నాయకులు బద్రి, చంద్ర, నరసింహారావు, షాలేమ్, కోటయ్య, ఆనంద్, దుర్గా ప్రసాద్, రాము, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల పోటీలు

● సీనియర్ విభాగం విజేతకు బుల్లెట్ బైక్ అందించిన ఆలపాటి

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డులో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల పోటీలలో చివరిగా సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 11 జతల ఎడ్లు పాల్గొన్నాయి. నంద్యాలకు చెందిన కేశవరెడ్డి, హుజూర్‌నగర్‌కు చెందిన సురేంద్రరెడ్డి కంబైన్డ్ ఎడ్ల జత 3619 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించగా వారికి బుల్లెట్ బైక్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవి దంపతులు అందజేశారు. యూఎస్ఏకు చెందిన డాక్టర్ శ్యాంప్రసాద్, రాజేశ్వరి ఈ బహుమతి సమకూర్చారు. తాడేపల్లికి చెందిన నిక్షిత్‌రెడ్డి ఎడ్ల జత 3394 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, ప్రత్తిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 3351 అడుగుల దూరం లాగి తృతీయస్థానం, హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ బుల్స్ రోహన్ బాబు ఎడ్ల జత 3190 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్ల జత 3076 అడుగుల దూరంగా లాగి ఐదో స్థానం, ఎర్రగొండపాలెంకు చెందిన పెదచాంద్ ఎడ్ల జత 3006 అడుగుల దూరం లాగి ఆరోస్థానం, రెడ్డిపాలెంకు చెందిన దివాకర్ ఎడ్ల జత 2798 అడుగుల దూరం లాగి ఏడోస్థానం, వేటపాలెంకు చెందిన శివకృష్ణ చౌదరి ఎడ్లజత 2716 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానం, సూర్యాపేట జిల్లా మఠంపల్లి శ్రీధర్‌రెడ్డి ఎడ్ల జత 2704 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానం సాధించాయి. విజేతలకు (ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు వరుసగా) దాతలు షైనేని మురళీకృష్ణ రూ.లక్ష, అడుసుమల్లి రతీష్ రూ.80 వేలు, కొత్తమాసు కుమార్ రూ.70 వేలు, కొత్తపల్లి కృష్ణమోహన్ రూ.60 వేలు, కైతేపల్లి షాలేంరాజు రూ.50 వేలు, నన్నపనేని సుధాకర్ రూ.40 వేలు, గూడూరు శివనాగరాజు రూ.30 వేలు, ఈదర వెంకటపూర్ణచంద్ రూ.20 వేలు, గాజుల వెంకటసుబ్బయ్య రూ.15వేలు బహుమతిగా అందజేశారు.



సీనియర్ విభాగం విజేతకు బుల్లెట్ బైక్‌ను అందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, మాధవి దంపతులు

సిమెంట్ ఫ్యాక్టరీలకు 'కాసు' వత్తాసు

బాధిత గ్రామాల రైతుల ఆరోపణ

దాచేపల్లి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ ఫ్యాక్టరీల నిర్మాణాలు జరుగుతున్నా...నోరు విప్పని కాసు మహేష్‌రెడ్డి నేడు ఆ యాజమాన్యాలకు అనుకూలంగా వకల్తా పుచ్చుకొని మాట్లాడటం ఎంత వరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. శనివారం దాచేపల్లి నగర పంచాయతీ, నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో భవ్య, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీల గ్రామాలకు చెందిన తక్కెళ్ళపాడు, పెదగార్లపాడు, తంగెడ గ్రామాలకు చెందిన రైతులు కూటమి నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీల దుమ్ము, ధూళితో మిరప పంట నష్ట పోయినా... ప్రభుత్వ అనుమతులు లేకుండా..బ్లాస్టింగ్‌తో ఇంటి పునాదులు కదలి పోతున్నా ఏనాడు పెదవి విప్పని కాసు మహేష్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఇష్టానుసారం చేస్తుంటే ఆయా కంపెనీలు ఇచ్చిన నోట్ల కట్టలతో మౌనంగా ఉన్న నీవా? ఆరోపణలు చేసేది, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల వలన భూములు కోల్పోయిన రైతులకు, దుమ్ము, ధూళి వల్ల పంట నష్ట పోయిన రైతులకు, ఇళ్ళు దెబ్బతిన్న బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పెదగార్లపాడు గ్రామంలో బలహీన వర్గాల కాలనీలో ప్రభుత్వం పేద వారికి నిర్మించిన పక్కా గృహాలు, చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ మైనింగ్ ధాటికి పగుళ్ళు ఏర్పడి ప్రమాదకర స్థితిలో ఉంటే ప్రజలను పట్టించు కోకుండా చెట్టినాడు కంపెనీ వద్ద ముడుపులు తీసుకుని పబ్బం గడిపారని ఆరోపించారు. తక్కెళ్ళపాడు గ్రామస్తుల పొలాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా క్రషర్ల నిర్మాణం చేసినా పట్టించు కోలేదన్నారు. భవ్య సిమెంట్ ఫ్యాక్టరీని సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీకి అమ్మాలని బెదిరింపులకు పాల్పడి ఫ్యాక్టరీని రెండు వందల కోట్లకు స్కామ్ చేసింది మీరు కాదా? అంటూ విమర్శించారు. సమావేశంలో బెల్లంకొండ బద్రి, తంగెళ్ళ శ్రీనివాసరావు, నర్రా పుల్లయ్య, వేముల తిరుమల కుమార్, పాముల కిషోర్, అంబటి మల్లి, అక్కినపల్లి బాలయ్య, తిరుమల దుర్గారావు, కొప్పుల వెంకటేశ్వర్లు, నాయబ్ అబ్దుల్లా, షేక్ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న తంగెడ, పెదగార్లపాడు, తక్కెళ్ళపాడు గ్రామస్తులు

షార్ట్ సర్క్యూట్‌కు ఒకరి మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో గంటన్నర సేపు భారీ వర్షం పడింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై కొన్నిచోట్ల వర్షపు నీరు చేరింది. ఆ సమయంలో కేబీ రోడ్డులో గడియార స్తంభం ప్రాంతంలో ఒక దుకాణంలో ఆర్క్ వెల్డింగ్ చేస్తున్న స్థానిక సుగాలీ కాలనీకి చెందిన బాణావతు బీమా నాయక్ (55) అనే వ్యక్తి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

ఆక్విడెక్ నిర్మాణానికి రూ.10.75 కోట్లు

-మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్‌కాలంలోని 1916వ సంవత్సరంలో భట్టిప్రోలు సమీపంలోని డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జి(సర్‌ప్లస్‌కేప్) ఇటీవల వర్షాలతో శిథిలమైపోవటంతో దాని నిర్మాణం కోసం రూ. 10.75 కోట్ల నిధులు మంజూరు చేయించామని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నగరం, నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాలతో పాటు వేమూరి నియోజకవర్గంలోని భట్టిప్రోలు పంటపొలాలైన 29,430ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ ఆక్విడెక్ నిర్మాణం వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తిచేస్తామని, రెండురోజుల్లో పనులు ప్రారంభం అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధికోసమే కృషిచెయ్యటం జరుగుతుందన్నారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

సత్యం,ధర్మం,న్యాయం అనే శ్రీరాముని ఆశయాలు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి అనగాని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి మీగృహాల్లో అందరికీ సుఖసంతోషాలను ఆరోగ్యాన్ని అందించాలని శ్రీరామచంద్రమూర్తి దయ అందరి కుటుంబాలపై ఉండాలని ఆకాంక్షించారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారంపూడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన కౌలు రైతు అన్నవరపు వసంతరావు(63) అప్పుల బాధతో పురుగు మందు తాగి మృతి చెందినట్టు కుమారుడు రవి వట్టిచెరుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వసంతరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వసంతరావు గత కొంత కాలంగా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తూ సరైన దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే మార్గం కన్పించక కొద్ది రోజులుగా మనస్తాపానికి గురై తన తండ్రి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు రవి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌లో వసంతరావు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు శనివారం సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన పట్టణలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాండురంగ పేటకు చెందిన వేజండ్ల సుబ్బారావు తన ద్విచక్రవాహనంపై చెంచుపేట ఫ్లై ఓవర్ మీదగా మార్కెట్ సెంటర్ వైపు వెళ్లే క్రమంలో వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయమైన సుబ్బారావును స్థానికులు జిల్లాప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోలీసులను సంప్రదించగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వందకు చేరిన టీడీపీ శాశ్వత సభ్యత్వాలు

రాష్ట్రస్థాయిలో చిలకలూరిపేటకు మూడోస్థానం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ శాశ్వత సభ్యత్వాలు 100కు చేరాయని, రాష్ట్రస్థాయిలో మంగళగిరి, ఆత్మకూరు తర్వాత చిలకలూరిపేట మూడో స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వాలు చేర్పించే బాధ్యతను పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరీముల్లాకు అప్పగించడంతో అతను సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. చిలకలూరిపేట మండలానికి చెందిన గొట్టిపాటి బాబు, తాళ్లూరి సాంబశివరావులు శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఒక్కో సభ్యత్వానికి రూ. లక్ష చొప్పున 100కు పైగా శాశ్వత సభ్యత్వాలు నమోదు కావడం, తద్వారా పార్టీకి కోటి రూపాయలు సభ్యత్వ రుసుము వసూలు కావడం పార్టీకి, చిలకలూరిపేటకు గర్వకారణం అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. కార్యక్రమంలో జవ్వాజి మదన్ మోహన్, నెల్లూరి సదాశివరావు, కందిమళ్ల రఘురామారావు పాల్గొన్నారు.



వంద శాశ్వత సభ్యత్వాలు పూర్తయిన సందర్భంగా నాయకులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కాకుమాను సాగునీటి వ్యవస్థకు మహర్దశ

● రూ.10 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చిన ప్రసాద్ సీడ్స్ అధినేత
● సీఎం పిలుపుతో పీ4లో భాగస్వామి అయ్యేందుకు నిర్ణయం

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన సీఎం చంద్ర బాబు ప్రారం భించిన పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్ర మానికి జిల్లాలో తొలి స్పందన లభించింది. కార్పొరేట్ దిగ్గజాల్లో ఒకరైన ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాదు కాకుమాను మండలంలో ఐదు వేల ఎకరాలకు పైగా భూమిని సాగునీటితో స్థిరీకరించేందుకు ముందు కొచ్చారు. ఇందుకోసం తన వంతు సాయంగా రూ.10 కోట్లను ప్రకటించారు. దీని వల్ల వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులకు మేలు జరుగు తుంది. ప్రసాదు చొరవ చూపించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన్ని అభినందించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను మండలం నాగార్జునసా గర్ కాలువ ఆయకట్టుకు చివరి భూములు. అలానే మండలంలో మొత్తం 33 వేల ఎక రాల సాగుభూమి ఉండగా కొమ్మమూరు కాలువ కింద 18 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 2,500 ఎకరాలు మాత్రమే మెట్ట భూమి. మిగతా భూమి అంతటికి సాగునీటి సదుపాయం ఉంది. నాగార్జునసాగర్ కాలువ కింద కొమ్మూరు, కొండపాటూరు గ్రామాల పరిధిలో సాగునీటికి కొంత సమస్య ఉత్పన్నమౌతున్నది. కొమ్మమూరు కాలువ కింద చివరి 10 కిలోమీటర్ల పరిధిలో భూములకు సాగునీరు సరిగా అందడం లేదు. ఇందుకో సం కొమ్మమూరు కాలువపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాల్సి ఉన్నది. దీని వల్ల కాకు మాను, బీకే పాలెం, అప్పాపురం, గరికపాడు, కొంపాటూరు గ్రామాల్లో 5315 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ నేపథ్యంలో పీ4లో భాగస్వామి అయ్యేందుకు కారుమంచి ప్రసాదు ముందుకొచ్చారు. శనివారం సీఎం చంద్రబాబుని ఆయన క్యాంపు కార్యాలయం లో కలిసి రూ.10 కోట్లను ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

● కాకుమానుకు చెందిన కారుమంచి ప్రసాదు 1982లో ప్రసాద్ సీడ్స్ సంస్థని స్థాపించి అంచెలంచెలుగా దేశంలోని వివిధ ప్రాంతాలకే కాకుండా ఫిలిప్పీన్స్, ఇండోనే షియా వంటి దేశాలకు కూడా వ్యాపారాన్ని విస్తరించారు. మొక్కజొన్న, వరి, చిరుధాన్యాలు, పొద్దు తిరుగుడు, పత్తి, జూట్ వంటి విత్తనాలను ఉత్పత్తి చేస్తూ రైతులకు సరఫరా చేస్తున్నారు. త్వరలో కాకుమాను మండలంలోనే డ్రోన్స్ ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీని కూడా నెల కొల్పబోతున్నారు. వ్యవసాయ రంగంలో నేడు డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా రైతుల అవసరాలకు తగ్గట్టుగా ఈ డ్రోన్స్ ఉత్పత్తి చేయబోతున్నారు.



క్యాంపు ఆఫీసులో సీఎం చంద్రబాబుతో ప్రసాద్ సీడ్స్ అధినేత

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 138, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని కేజీబీవీలో 6వ తరగతిలో, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఈనెల 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి కోరారు. అలాగే 7, 8, 9, 10, ఇంటర్ రెండో సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ఏపీకేజీబీవీ.ఏపీపీఎ్ ఎఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

గంగవరం కేజీబీవీలో..

గురజాలటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జూపల్లి జ్యోతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ మిగతా తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సెకండియర్ క్లాసులు జరుగుతున్నాయన్నారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాభవాని శనివారం తెలిపారు. ఆరో తరగతిలో 40, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 40, ద్వితీయ సంవత్సరంలో 14 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఈనెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయని, నోట్‌బుక్స్‌లు, రికార్డులు కళాశాలకు వచ్చాయని చెప్పారు.



శరభయ్య స్కూల్‌లో క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా

పోటీలు సోదరభావాన్ని పెంపొందిస్తాయి

సత్తెనపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పోటీలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శరభయ్యగుప్తా క్రీడా ప్రాంగణంలో న్యాయవాదులకు, పోలీసులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ని కన్నా ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి గౌస్, డీఎస్పీ హనుమంతరావు, సీఐ బ్రహ్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్, నేతలు ఎలినేడి రామస్వామి, ఎంవీ చలపతిరావు, జానీ ఖాజావలి, పలువురు న్యాయవాదులు, పోలీసులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. క్రికెట్ పోటీల్లో న్యాయవాదులపై పోలీసు జట్టు విజయం సాధించి కప్పును గెలుచుకుంది.

వైన్‌షాపు పెట్టవద్దు

సత్తెనపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతామందిరం ఎదురు వైన్‌షాపు పెట్టవద్దని స్థానిక మహిళలు, ప్రజలు శనివారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు, ఎక్సైజ్ సీఐకి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ ప్రాంతంలో బార్‌షాపు ఏర్పాటుచేస్తే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

7 నుంచి ఆరోగ్య సేవలు బంద్

సత్తెనపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకంలో భాగంగా సేవలు అందించిన ఆస్పత్రులకు ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ నిధుల మంజూరులో జాప్యం చేస్తున్నందుకు ఈనెల 7వ తేదీ నుంచి సత్తెనపల్లి పట్టణంలో ఐదు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయనున్నట్లు డాక్టర్ జీ శ్రీధర్ శనివారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే ఆరోగ్యశ్రీ కింద రాష్ట్రంలోని నెట్ వర్క్ ఆస్పత్రులకు గత ప్రభుత్వం రూ2,200కోట్లు బకాయి పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బకాయిలు మరింత పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం కొంత శాతం నిధులు విడుదల చేసినప్పటికీ ఆస్పత్రుల్లోని వైద్యులు, ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు 7వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కండ్లకుంటలో కంటి వైద్య శిబిరం

నకరికల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కండ్లకుంటలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రావెల సాయినవీన్, ప్రొఫెసర్ నాన్సీ జాస్మిన్, ఎన్ఎ్ ఎఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీ విజయకుమార్, రావెల సత్యనారాయణ పాల్గొన్నారు.

పిన్నెల్లి శవ రాజకీయాలను మానుకోవాలి

టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పశువేముల గ్రామంలో సొంత కుటుంబంలో మామ, అల్లుళ్ల మధ్య భూవివాదంలో గత నాలుగు నెలలుగా గొడవలు చోటుచేసుకుంటున్నాయన్నారు. నాలుగు నెలల క్రితం అల్లుడిని మామ గొడ్డలితో నరికితే ఇప్పటికీ అల్లుడు కోమాలో ఉన్నాడన్నారు. ఆ కక్షతో అల్లుడి తల్లితోపాటు కుటుంబసభ్యులు మామను హత్య చేశారన్నారు. దీనికి పిన్నెల్లి రాజకీయ రంగు పులమడం సిగ్గుచేటన్నారు. జగన్ విషపత్రిక సాక్షిలో అబద్ధాలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మంత్రి లోకేశ్ గురించి మాట్లాడే స్థాయి పిన్నెల్లి లేదన్నారు. లోకేష్ రెడ్‌బుక్ తెరిస్తే నువ్వు మాచర్లలో తిరగలేవని వీరాస్వామి యాదవ్ అన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

కారంపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కసిన్యానాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో పంచాయతీ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ట్రాక్టర్‌లో మాత్రమే వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే రూ.500 జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బండిలోనే చెత్తను వేయాలి

దుర్గి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బండిలోనే చెత్తను వేయాలని కోలగుట్ల పంచాయతీ కార్యదర్శి ఆర్ఎండీ అఫీజుద్దీన్ అన్నారు. శనివారం గ్రామంలో మైక్ ద్వారా ప్రచారం చేయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వీఆర్ ఎస్‌కాల్స్‌కు కోలగుట్ల గ్రామం ఎంపికైందన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం పారిశుధ్య కార్మికులతోపాటు గ్రీన్ అంబాసిడర్లను కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. అనంతరం చెత్త బండి ద్వారా చెత్త సేకరించి, తరలించడాన్ని పర్యవేక్షించారు.

చలివేంద్రం ఏర్పాటు

మాచర్లటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు ఆధ్వర్యాన శనివారం పట్టణంలోని నెహ్రూనగర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు.

సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్‌కు రుణపడి ఉంటాం

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్‌కు రుణపడి ఉంటామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

గురజాలటౌన్‌లో..

గురజాలటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని కూటమి నేతలు గురజాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, కౌన్సిలర్ నేలవల్లి వరలక్ష్మి బొల్లయ్య, శరమాల హనుమంతరావు, జాస్తి ప్రకాష్, కత్తి చలమరాజు, యేసుపోగు రాంబాబు, నాగుల్‌మేస్త్రీ, షేక్ హుస్సేన్, చింతకాలయ కోటి, నలగొర్ల కొండలు, కత్తి ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

కారంపూడిలో..

కారంపూడిలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఆర్ఐ వేముల శ్రీనివాసరావు, ఒప్పిచర్ల వీఆర్వో భూక్యా శ్రీనివాసరావునాయక్, వీఆర్ఏ కొమ్ము కిషోర్, చెన్నయ్య, అంజమ్మ, వలి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి జనసేన నేత పాలెపోగు బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాచర్ల పట్టణంలో..

మాచర్లటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్ము కిషోర్ ఆధ్వర్యాన పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంతోషరావు, సుందరరావు, జీవన్, మధు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మధుబాబు, రమేష్, అనిల్‌కుమార్, లక్ష్మీ సుధాకర్, పోతురాజు, సునీల్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్‌లో..

మాచర్ల రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఎమ్మార్పీఎస్ నేత ఊరే మార్కు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్యామ్యూల్, టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ అధ్యక్షుడు మీసాల దానియేలు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మధు పాల్గొన్నారు. అలాగే మానవ సేవాసమితి ఆధ్వర్యాన జయంతిని నిర్వహించారు.

రెంటచింతలలో..

రెంటచింతల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని రెంటచింతలలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గడిపర్తి శ్రీనివాసరావు, మామి సామ్యేల్, టి.మరియబాబు, డేగల జక్రయ్య, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో..

దుర్గి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దుర్గిలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుకూరి రమేష్, శ్యామ్, సంజయ్, రాము, దేవభిక్షం, అభిషేక్, నాగరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

అచ్చంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సందెపోగు వెంకయ్య, తిరువాయిపాటి అంజనేయులు, ఎస్ హరిబాబు, రాయిడి సాంబశివుడు, తాడిబోయిన కృష్ణమ్మ, ఎన్ చందు, వెంకయ్య, శిఖా నరసింహారావు, కోట చంటి, సందెపోగు శ్రీను, అంబటి నారాయణ తదితరులు పాల్గొన్నారు. అచ్చంపేటలోని లీప్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో అంబేద్కర్ ట్రస్ట్ చైర్మన్ చిలుకా చంద్రయ్య జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.



అచ్చంపేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంకొండలో..

బెల్లంకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. బెల్లంకొండ ప్రభుత్వ రెబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇంకా పాఠశాల ప్రిన్సిపాల్ పెదబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం క్రోసూరులో ఘనంగా నిర్వహించారు. పిడుగురాళ్ళ బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్యమాట్లాడుతూ ఆయన ఆదర్శాలు నేటి తరానికి మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుముల వెంకట రామిరెడ్డి, దద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, ఊరే రోశయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని జలాలపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోశాధికారి కంచర్ల జాన్‌బాబు, ఎమ్మార్పీఎస్ నేతలు పేతురు, దాసుబాబు, థామస్, మన్నవ రామారావు, వేమవరపు జీవన్, మధు, బాలరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ వార్డుల పర్యటన

మాచర్లటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 9, 15, 27 వార్డుల్లో శనివారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించారు. ఆయా వార్డుల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. 9వ వార్డులో ప్రజలు తాగునీటి సమస్యలను చైర్మన్ నరసింహారావు దృష్టికి తీసుకురాగా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు చెల్లించకుండా

ఆలయ భూములు సాగు చేయొద్దు..

రెంటచింతల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయ భూములకు కౌలు చెల్లించకుండా సాగుచేయడానికి భూముల్లోకి వెళ్లవద్దని ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే లక్షలాది రూపాయలు పెండింగ్‌లో ఉందని కొన్ని గ్రామాల్లో అర్చక భూములు బీళ్లుగా ఉన్నాయన్నారు. మండలంలోని వివిధ ఆలయాల కింద 399ఎకరాల 58సెంట్లున్నాయన్నారు. ఈ నెల 11నుంచి భూములవేలం నిర్వహించనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

రెంటచింతల ప్రధాన రహదారి విస్తరణకు

రూ.8 కోట్లు కేటాయింపు

రెంటచింతల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రెంటచింతల రహదారి విస్తరణ కల సాకారం కానుంది. జాతీయ రహదారుల విస్తరణ అధికారులు రెంటచింతల, మాచర్ల, గురజాల గ్రామాల్లో నేషనల్ హైవే విస్తరణలో భాగంగా రూ.54.09కోట్లు కేటాయించారు. తొలుత రెంటచింతల టౌన్‌లో సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరగా అంగీకరించిన అధికారులు రెండు వరుసల తారు రోడ్డును నిర్మించాలనే ప్రతిపాదనను ఉన్నతాధికారులు పంపగా వారు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. వైఆర్ఎస్ హైస్కూల్ నుంచి హెచ్‌పీ గ్యాస్ వద్ద జాతీయ రహదారి వరకు రెండు లైన్ల తారురోడ్డు నిర్మించనున్నారు. రెండు కి.మీ. దూరం వుండే ఈ రహదారికి రూ.8కోట్లు కేటాయించారు. అందులోనే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

నవమికి ముస్తాబైన ఆలయాలు

క్రోసూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా రాములవారి కల్యాణానికి మండలంలోని పలు గ్రామాల్లో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం, నాలుగు రోడ్ల సెంటర్, రెడ్ల బజారు, విద్యానగర్, ఆంజనేయ స్వామి గుడి సెంటర్లలో రాములవారి కల్యాణానికి పందిళ్లు సిద్ధం చేశారు. అభయాంజనేయ స్వామి విగ్రహం, సిద్ధిపాలెం ఆంజనేయస్వామి దేవాలయం, ఉయ్యందన ఆంజనేయస్వామి విగ్రహం, అనంతారం, దొడ్లేరు, 88 తాళ్ళూరు గ్రామాల్లో రామాలయాల్లో నవమి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

అమరావతి మండలంలో..

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి) శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మండల పరిధిగ్రామాలలోని రామాలయాలు విద్యుత్‌దీపాలతో చలువ పందిళ్లతో ముస్తాబైనాయి. సీతారాముల కళ్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి పూలతో అలంకరించారు. స్వామివార్ల కళ్యాణమహోత్సవంనకు అన్ని ఆలయాలలో దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణలు చేయడం జరిగింది.

పెదకూరపాడు మండలంలో..

పెదకూరపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల రామాలయాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఆదివారం జరిగే సీతారాముల కళ్యాణానికి చలువపందిళ్లను ఏర్పాటు చేశారు.

మాచవరం మండలంలో..

మాచవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీన మండల గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే చలువ పందిళ్ళు ఏర్పాటుచేశారు. వేమవరంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాట్లు చేశారు. మోర్జంపాడు, పిన్నెల్లి, పిల్లుట్ల, మల్లవోలు, చెన్నాయపాలెం తదితర గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ళ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు గ్రామీణప్రాంతాలలో స్వామివారి కల్యాణానికి చలువపందిళ్లు ముస్తాబయ్యాయి. జానపాడురోడ్డులోని ఐలాండ్ సెంటర్‌లో భారీగా పందిరివేసి కల్యాణానికి ఏర్పాట్లుచేశారు. పట్టణంలోని పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో నవమికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

దాచేపల్లి మండలంలో..

దాచేపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దాచేపల్లిలోని రామాలయంలో వద్ద ఐదువేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది.

గంగమ్మ గుడికి రూ.లక్ష వితరణ

దాచేపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొందుగుల గ్రామంలో గంగమ్మ గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.లక్ష నగదును అందజేశారు. శనివారం టీడీపీ నాయకులు గార్లపాటి రెహ్మాన్ ఆధ్వర్యంలో యాదవులకు నగదు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే యరపతినేని రాక

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం పలుచోట్ల సీతారాముల కల్యాణోత్సవాల్లో పాల్గొనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను తెలిపారు. అలాగే మాచవరం మండలం కొత్తగణేశునిపాడు శ్రీరామదూత అభయాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే కల్యాణంలో కూడా పాల్గొననున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 517.10 అడుగులు ఉంది. ఇది 144.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3031 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5087, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 10,218 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 30.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

రేపు అదనపు తరగతి గదుల ప్రారంభం

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ మంజూరు చేసిన రూ.33లక్షల ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతిగదుల భవనాన్ని సోమవారం ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నారు.

కారు మబ్బులు.. చిరు జల్లులతో

మిర్చి రైతుల్లో ఆందోళన

క్రోసూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండల వ్యాప్తంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న చిరు జల్లులు, కారు మబ్బులతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా కల్లాల్లో రైతులు మిర్చిని ఎండబెట్టారు. వర్షానికి తడబకుండా పట్టలు కప్పారు. అసలే ధర లేక అల్లాడుతున్న ప్రస్తుత తరుణం లో వర్షాలకు మిర్చితడిస్తే మరింతనష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

ఘనంగా ఆంజనేయులు జన్మదినం

పెదకూరపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు జన్మదినాన్ని శనివారం పెదకూరపాడులో నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ గృహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ మండల నేతలు మక్కెన సాగర్, కోరంపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో తనిఖీ

బెల్లంకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో రెండు రేషన్ దుకాణాలను శనివారం తహసీల్దార్ అస్రిపున్నీసా బేగం తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. లబ్ధి దారులకు రేషన్ సక్రమంగా అందించాలని సూచించారు. ప్రతి కార్డుదారుడికి ఈకేవైసీని తప్పకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. రేషన్‌షాపుల యజమానులు అవినీతికి పాల్పడినా, రేషన్ కార్డు దారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టు ఎంపికకు పోటీలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో శనివారం రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను విద్యాసంస్థల డైరెక్టర్ బొల్లా గిరిబాబు, ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్‌డీ ప్రసాద్‌లు ప్రారంభించారు. సుమారు 325మంది క్రీడాకారులు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చారు. తొలిరోజు శనివారం పల్నాడు, నెల్లూరు, ఎన్‌టీఆర్ జిల్లాలకు చెందిన బాలుర విభాగం సెమీఫైనల్‌కు చేరుకుంది. పల్నాడు జిల్లా టీమ్‌లో ప్రతిభ కనబరిచిన ఆక్స్‌ఫర్డ్ కళాశాల విద్యార్థి వసంత్‌ను ఆంధ్రప్రదేశ్ టీమ్‌కి ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ పి.నరేష్ అభినందించారు. నేడు అన్ని విభాగాలలో సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని క్రికెట్ అబ్జర్వర్ షేక్ రన్ హుస్సేన్ తెలిపారు.



టెన్నిస్‌బాల్ క్రికెట్‌కు ఎంపికైన సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ అసిసోయేషన్ కార్యదర్శి ప్రసాద్ తదితరులు



పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, రాష్ట్ర కార్యదర్శి తురకా వీరస్వామి, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పణితి రవి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వడ్డవల్లి సాంబశివరావు, మందా డేవిడ్, వల్లెపు రామకృష్ణ, గుజ్జర్లపూడి కరుణాకర్, బిజిలి వెంకట్రావు, జమ్మిశెట్టి రామకృష్ణ, గోళ్ల కిరణ్, మొగిలి ఏడుకొండలు, ఐతం పెదమాణిక్యరావు, చల్లగుండ్ల రూబెన్, పేతురు, మందా జాకబ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లెనిన్‌నగర్‌లోని కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్, న్యాయవాది ఆదూరి రూత్‌బనియన్, రెంటచింతల ఏసీఓ రవి, వేల్పుల సంతోష్, రామా ఇస్రాయేలు, గడ్డం శామ్యేల్, లత తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణ సీఐ వెంకట్రావు, ఎస్ఐలు మోహన్, శివనాగరాజు, మాతంగి సత్యానందం, మీసాల బాబు, దేవరకొండ సుశీల, వడ్లమూడి కోటేశ్వరి, వర్ల అగస్టీన్, తదితరులు నివాళులర్పించారు.

మాచవరంలో...

మాచవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మాజీ భారత ఉపప్రధాని బాబుజగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో నాంచారయ్య, జూనియర్ అసిస్టెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో...

దాచేపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం దాచేపల్లి మండలంలో నిర్వహించారు. టీడీపీ, ఎస్‌టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రామాపురం గ్రామంలోని జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడిన జగ్జీవన్‌రామ్

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అమరావతి బస్టాండ్‌లో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం కోసం.. సామాజిక సమానత్వం కోసం బాబుజగ్జీవన్‌రామ్ పోరాడారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయంతిలో పాల్గొన్న కన్నా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, బండారు నాగరాజు, బలిజేపల్లి సురేష్‌కుమార్, గుజ్జర్లపూడి స్టాలిని, గుంటూరు ఆశీర్వాదం, శనగపూల నరసింహారావు, చిలకా శ్యామ్, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, మర్రి వెంకట రామిరెడ్డి, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, సయ్యద్ పెద కరిముల్లా, నూర్‌బాషా జాన్ బాబు, రాంబో బుడే తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహంలో వసతి గృహ సంక్షేమ అధికారి పాలెపోగు సుమణి అధ్యక్షతన జయంతి జరిగింది. బీసీ సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, వైసీపీ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో డాక్టర్ విలయం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ, బార్ అసోసియేషన్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.


రెంటపాళ్ళల్లో

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటపాళ్ళల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, పలువురు టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మక్కపాటి భాస్కర్, చెన్నమల్లు మోహన్‌బాబు, పలువురు ఎస్సీ నేతలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

నకరికల్లు ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై చల్లగుండ్ల శివారు పెట్రోల్ బంకు గోరంట్ల మేజర్ మధ్యలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గురజాల మండలం గోగులపాడుకు చెందిన వై.గోవిందరాజులు(40) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మృతుడు మరొకరితో కలిసి నరసరావుపేటలోని ఆసుపత్రిలో ఉన్న బంధువులను పరామర్శించి తిరిగి నరసరావుపేట వెళ్లే క్రమంలో టిఫిన్ చేద్దామని రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోవిందరాజులను 108లో నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌కి తరలించారు. అప్పటికే గోవిందరాజులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...



వెంకటరాజు మృతదేహం

అచ్చంపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రోసూరు వేల్పూరు గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన ఓర్సు వెంకటరాజు(18) అనే యువకుడు మృతిచెందాడు. వేల్పూరు గ్రామంలో ఉన్న తన అక్కబావను చూసేందుకు వచ్చి చికెన్ కోసమని క్రోసూరుకు వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఇతను బెంగుళూరులో మట్టి పనులు చేస్తుంటాడని తెలిసింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. కేసు దర్యాప్తుచేస్తున్నట్లు అచ్చంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద శనివారం జరిగింది. మండలంలోని సుబ్బారెడ్డిపాలెంకు చెందిన సోదరబోయిన నరసింహారావు ద్విచక్రవాహనంపై మాచర్ల నుంచి సుబ్బారెడ్డిపాలెంకు వెళ్తుండగా మార్గమధ్యంలోని భైరవునిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన నరసింహారావును 108లో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

అమరావతి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన ప్రభుత్వం పరిష్కరించాలని పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో జరిగిన అమరావతి, పెదకూరపాడు మండలాల యూనిట్ పెన్షనర్ల సర్వసభ్యసమావేశంలో సుబ్బారావు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సమావేశానికి జి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పీసీ ఆదెయ్య, జిల్లా కోశాధికారి ప్రసాద్, వై సుబ్బారావు, ప్రధానకార్యదర్శి తిమ్మయ్య ప్రసంగించారు.

అకాల వర్షం.. నష్టం

మధ్యాహ్నం వరకు మండిన ఎండ
సాయంత్రం ఈదురుగాలులతో వాన
కల్లాల్లో తడిచిన పంట దిగుబడులు



కొల్లిపరలో మొక్కజొన్న కండెలు చుట్టూ వర్షపు నీరు చేరడంతో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు



కొల్లిపర మండలం దావులూరులో మొక్కజొన్న కల్లాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతులు

గుంటూరు, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, తెనాలిఅర్బన్, పెదకూరపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, తెనాలి, కొల్లూరు, వేమూరు, కొల్లిపర, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరు ములు, పిడుగులతో వర్షం కురిసింది. అకాల వర్షంతో కల్లాల్లోని పంట దిగుబడులను రక్షించుకునేందుకు పట్టలతో రైతులు పొలాల బాట పట్టారు. అకాల వర్షం రైతులను నష్టాల పాలు చేసింది. రబీ పంట చేతికొచ్చే తరుణంలో కురిసిన అకాల వర్షానికి జొన్న, మొక్కజొన్న పంట ఉత్పత్తులు దెబ్బతిన్నాయి. వానతో మొక్కజొన్న కండెలు, గింజలు బూజుపట్టి నాణ్యత కోల్పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ధాటికి కొన్ని చోట్ల మొక్కజొన్న, జొన్న పైర్లు నేలవాలాయి. గుంటూరు నగరం, తెనాలి పట్టణంలో మండు వేసవిలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయం అయ్యాయి. మురుగు కాల్వలు, వాన నీరు ఏకమై రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

● కొల్లూరు, కొల్లిపర మండలాల్లో గంట పాటు ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి పొలాల్లో విరిచి ఉన్న కండెలు, పట్టాలపై ఆరబోసిన మొక్కజొన్న గింజలు తడిసిపోయాయి. పచ్చి ఇటుకలు చాలావరకు తడిసిపోయాయి. వర్షం కారణంగా రూ.2 కోట్లు వరకు నష్టం వాటిల్లినట్లు పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి. వేమూరు మండల పరిధి కోతకు వచ్చిన జొన్న పైర్లు పడిపోయాయి. రాశులపై ఉన్న కంకులను రక్షించుకునేందుకు రైతులు పట్టాలు కప్పుకున్నారు. కొల్లిపర మండల పరిధిలో కల్లాలో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న, జొన్న దిగుబడులను ట్రాక్టర్ల ద్వారా రైతులు హడావుడి ఇళ్లకు తరలించారు. పట్టాలు కప్పిన పసుపు, మొక్కజొన్న, జొన్నలు కూడా తడిచిపోయాయి. గాలికి పలు చోట్ల అరటి చెట్లు నేలవాలాయి.

● పెదకూరపాడు ప్రాంతంలో కురిసిన అకాల వర్షానికి కల్లాల్లోని మిర్చి తడిచిపో యింది. వర్షంతో రైతులు మిర్చి కల్లాల వైపు పట్టలతో పరుగులు తీశారు. మిర్చి కోతలు కోసి ఎండబెట్టే సమయంలో వర్షానికి రంగు మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాయలను గ్రేడింగ్ చేస్తూ కల్లాల్లో ఉంచగా అది తడిచిపోయింది.



గుంటూరు మిర్చియార్డులో తడిసిన మిర్చి

వ్యవసాయ శాఖ సూచనలు

అకాల వర్షాలకు జొన్న ఓదెలు తడిసిన చోట రైతులు ఎండ రాగానే వాటిని తిరగదీయాలని వ్యవసాయశాఖాధికారులు రైతులకు సూచనలు చేశారు. పల్లపు ప్రాంతాల్లో ఓదేలపై నీరు నిలిస్తే వెంటనే బయటకు పెట్టి ఉప్పు స్ప్రే చేయాలని తెలిపారు.

యార్డులో తడిసిన మిర్చి టిక్కీలు

అకాలవర్షం మిర్చియార్డుకు మిరపకాయల టిక్కీలు తీసుకొచ్చిన రైతులకు అపార నష్టాన్ని కలిగించింది. శుక్రవారం యార్డుకు తీసుకొచ్చిన మిర్చి టిక్కీల అమ్మకాలు జరగగా మిగిలినవి వేలం కేంద్రాల వెలుపలే ఉన్నాయి. తేమ శాతం అధికంగా ఉన్న కాయలను దుకాణాల ఎదుట ఆరబోశారు. శనివారం యార్డుకు సెలవుదినం కావడంతో హమాలీలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో లేరు. ఉదయం నుంచి ఎండ మండుతూ ఎలాంటి వర్షసూచన లేదు. అయితే సాయంత్రం 4 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై యార్డు పరిసరాల్లో భారీగా వర్షం కురిసింది. దాంతో చాలావరకు మిర్చి టిక్కీలు తడిసిపోయాయి. ఆరబోసిన మిర్చి కిందకు వర్షం నీరు చేరడంతో అవి పూర్తిగా నానిపోయాయి. దాదాపుగా 100 క్వింటాళ్ల వరకు మిర్చి తడిసిపోయి ఉంటుందని భావిస్తున్నారు. అసలే మిర్చికి ధర లేక దిగాలు చెందుతున్న రైతులపై అకాల వర్షం పిడుగుపాటులా మారి మరింత చిదిమేసింది.



గుంటూరు మిర్చియార్డులో మిర్చిపై పట్టలు కప్పుతున్న రైతులు

కృష్ణానదిపై మరో వంతెన

(5వ పేజీ తరువాయి)

ప్రవాహం తక్కువగా ఉంటుంది. అరకిలోమీటరు బ్రిడ్జికి అనుబంధంగా మాదిపాడు వైపు అరకిలోమీటరు, ముక్త్యాల వైపు రెండున్నర కిలోమీటర్ల వంతున అప్రోచ్ రోడ్డును నిర్మించాలి. ఇందుకు అవసరమైన భూములు కూడా అందుబాటులో ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నదిలో 14 పిల్లర్లను నిర్మించనున్నారు. అటూ ఇటూ ఫుట్‌పాత్‌లతోపాటు మూడు వరుసలతో వంతెనను రెండేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బ్రిడ్జి నిర్మాణంతో ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలతోపాటు తెలంగాణాలోని సూర్యపేట, ఖమ్మం జిల్లాల ప్రజలకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది. ఈ బ్రిడ్జి వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జి కన్నా ముందే ప్రజలకు అందుబాటులోకి రానుంది.



ప్రమాద భరిత పడవ ప్రయాణాలకు చెల్లుచీటి

జాప్యం కారణంగా పెరిగిన వ్యయం

మాదిపాడు-ముక్త్యాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి తొలినాళ్లలో రూ.15 కోట్లు వ్యయం కాగలదని అంచనాలను రూపొందించారు. ఆ తర్వాత అది రూ.36.19 కోట్లుగా, ఆ తర్వాత రూ.39.69 కోట్లుకు పెరిగింది. ప్రస్తుతం అంచనా వ్యయాన్ని పెంచి రూ.60.54 కోట్లకు గతేడాది నవంబరులో ఆర్‌అండ్‌బీ టెండర్లను ఆహ్వానించింది. వల్లభనేని కనస్ట్రక్షన్స్ కాంట్రాక్టును దక్కించుకునేందుకు ముందుకొచ్చింది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన బ్రిడ్జి కావడంతో నిధులను సమాకూర్చడానికి నాబార్డు ముందుకొచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపి కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపి వారిని ఒప్పించి మరీ బ్రిడ్జి కాంట్రాక్టును అప్పగించింది. దీంతో సదరు కాంట్రాక్టు సంస్థ తాజాగా బ్రిడ్జి నిర్మాణపనులను ఆరంభించింది.

బహిరంగ మద్యపాన నిషేధానికి పటిష్ట చర్యలు

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలలో మద్యపాన నిషేధానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుంటూరు బ్రాడీపేటలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, అచ్చంపేట, నరసరావుపేట, బొల్లాపల్లి మండాల్లోని 28 గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు జరుపుతున్నారని..నవోదయం 2.0 కార్యక్రమం కింద ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి 11 గ్రామాలను నాటుసారా తయారీ గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు 1364 కేసులు నమోదు చేసి 916 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి 2098 లీటర్ల లిక్కర్, బీరు 99 లీటర్లు, 376 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు 2.35 కేజీల గంజాయి, 8.5గ్రాముల కొకైన్, 14.35గ్రాములు ఎండీఎంఏ, 18 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. 667 బెల్టు షాపులపై దాడులు నిర్వహించి 669 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1489 లీటర్ల మద్యం, 40లీటర్ల బీరు, 4 వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా బహిరంగ మద్యం సేవిస్తున్న 132 మందిని అరెస్టు చేసి 127 కేసులు నమోదు చేశామని వివరించారు. 1002 మందిపై బైండోవర్ చేయడం జరిగిందన్నారు. కల్తీ కల్లు నిరోధానికి 117 శాంపిల్స్, బార్‌లో లిక్కర్ నాణ్యతను పరిశీలించేందుకు 158, మద్యం దుకాణాల్లో మద్యం నాణ్యతను పరిశీలించేందుకు 106 శాంపిల్స్‌ను సేకరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏఈఎస్ ఈడే మారయ్యబాబు, ఎక్సైజ్ వన్ టౌన్ సీఐ బీ లత పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏఈఎస్ మారయ్య బాబు

అమరావతిలో ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరారు

విజయవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు టెండర్లు ఖరార య్యాయి. అసెంబ్లీ నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ సంస్థ దక్కించుకుంది. హైకోర్టు నిర్మాణ పనులను ఎన్‌సీసీ దక్కించుకుంది. ఈ రెండు టెండర్లలో ఎల్ - 1 గా నిలిచిన ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ సంస్థలకు ఎల్‌ఓఏ ఇచ్చేందుకు సీఆర్‌డీఏ ప్రతిపాదనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. శనివారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ 46 వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా అమరావతి రాజధానిలో ఐకానిక్‌గా నిర్మించే అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలకు పిలిచిన టెండర్లలో ఎల్ - 1 నిలిచిన సంస్థలకు ఎల్‌ఓఏలను ఇచ్చే అంశంపై చర్చ జరిగింది. ఐకానిక్ అసెంబ్లీ విషయానికి వస్తే బేస్‌మెంట్‌తో పాటు జీ ప్లస్ 3 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీనికి వ్యూయింగ్ ప్లాట్‌ఫామ్‌లు, పనోరమిక్ వ్యూ వంటివి కూడా ఉంటాయి. మొత్తం 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తారు. దీని ఎత్తు 250 మీటర్లుగా ఉంటుంది. హైకోర్టు విషయానికి వస్తే బేస్‌మెంట్‌తో పాటు జీ ప్లస్ 7 విధానంలో నిర్మించాల్సి ఉంటుంది. దీని బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. దీని ఎత్తు 55 మీటర్లుగా ఉంటుంది. ఈ రెండు ఐకానిక్ నిర్మాణాల కోసం పిలిచిన టెండర్లకు సంబంధించి ముఖ్యమంత్రి సమీక్షించారు. ఎల్ - 1 గా నిలిచిన సంస్థలకు ఎల్‌ఓఏలు ఇవ్వాల్సిందిగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు ముఖ్యమంత్రి ఆదేశించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం ఇంకా అవసరమైన నిధుల సమీకరణ అంశంపై కూడా అథారిటీ సమావేశంలో ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధుల సమీకరించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతులు ఇస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. చేపట్టాల్సిన మిగిలిన పనులకు కూడా ఎలాంటి నిధుల కొరత రాకుండా త్వరితగతిన ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు చేపట్టేందుకు వీలుగా సీఆర్‌డీఏ కమిషనర్‌కు అన్ని రకాల అనుమతులను కల్పిస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది.

సీతారాముల కల్యాణం చూతము రారండి

తెనాలిలో నవమి వేడుకలకు చలువ పందిళ్లు సిద్ధం
బోసురోడ్డులో 94వ ఏటా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా అంతటా కన్నుల పండువగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. నవమి వేడుకలకు ఆంధ్రా ప్యారిస్ తెనాలి ముస్తాబైంది. అపర భద్రాద్రిగా వినుతికెక్కిన పట్టణంలో శ్రీసీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు అన్ని చోట్ల ఏర్పాట్లు గావించారు. మెయిన్ రోడ్డు మొత్తం గాడిబావి సెంటర్ నుంచి గాంధీ చౌక్ వరకు చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. ఈ రహదారి అనుబంధ రోడ్లు కూడా కల్యాణం కోసం పందిళ్లు వేసి అలంకరించారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో కళ్యాణం కోసం ముస్తాబు చేశారు. 1919లో ఇక్కడ దీపపు సిమ్మె ఏర్పాటు చేసుకుని భక్తులు భజనలు చేసేవారు. బ్రిటీష్ ప్రభుత్వం దేవాలయ నిర్మాణానికి అంగీకరించకపోవడంతో గ్రామస్తులంతా కలిసికట్టుగా రాత్రి పూట చిన్న ఆలయం నిర్మించి తెల్లవారే లోగా ప్రతిష్ట కూడా పూర్తి చేశారు. దీంతో దొంగరాముని గుడిగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. భద్రాచలంలో ఉన్న విధంగా ఇక్కడ శ్రీసీతారామ చంద్రులు ఒకేశిలపై ఉండటం విశేషం. క్రమేణా ఆలయాన్ని అభివృద్ధి చేసి మూడు గాలి గోపురాలతో జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన రామాలయంగా తీర్చిదిద్దారు. ఇక్కడ ప్రతిఏటా ఉగాది నుంచి నవమి వరకు ప్రత్యేక అలంకారాలు, గ్రామోత్సవాలు, కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో సంతానం లేని వారికి గరుడ ముద్దల ప్రసాదం అందిస్తారు. బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో ఉగాది నుండే చలువ పందిళ్లు వేసి సీతారాముల వారికి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ శాంతి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. 93 ఏళ్లగా ఈ మందిరంలో ఉగాది నుంచి నవమి వరకు ఉత్సవాలు నిర్వహించి పెద్దఎత్తున అన్నదానం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నిత్యపూజలు, శ్రీరామ కర్ణామృతంపై ప్రవచనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. పట్టణంలోని పలు రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి కమిటీల ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు గావించారు. పందిళ్లను రంగు రంగుల విద్యుద్దీపాలు, వస్త్రాలతో అలంకరించారు. ప్రతి ఏటా మెయిన్ రోడ్డులో పెద్ద సంఖ్యలో వ్యాపారస్తుల కుటుంబాలు సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. 43 ఏళ్లగా హనుమాన్ చౌక్‌లో నిర్వహిస్తున్న కళ్యాణానికి శ్రీసీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. మందిర కమిటీ కార్యదర్శి కె.సూర్యనారాయణమూర్తి, విద్యాధర్, రవిశంకర్, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. గాడిబావి సెంటర్‌లో ఈవో అమర్‌నాథ్, అర్చకులు గురునాథ ప్రసాదశాస్త్రి ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.



తెనాలి మెయిన్ రోడ్డులో వేసిన చలువ పందిళ్లు



ఆలయంలో జరుగుతున్న పూజలు

ప్రేక్షకులను ఆలోచింపచేసిన నాటికలు

రెండోరోజు కొనసాగిన పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం నాటకోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి నాటిక పోటీలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు పోటీలలో 4 నాటికలు ప్రదర్శితమయ్యాయి. రెండవ రోజు కార్యక్రమాల్లో భాగంగా ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి అతిథులు నిర్వాహకులు నివాళులర్పించారు. అనంతరం నాటిక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ప్రతి నాటిక విభిన్నమైన కోణంలో సందేశాత్మకంగా సాగాయి. ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింప చేశాయి. ప్రతి నాటిక అనంతరం ప్రేక్షకుల నుంచి వచ్చిన కూపన్‌లను డ్రాతీసి పది మంది చొప్పున 30మంది విజేతలను ఎంపిక చేశారు అంతేగాకుండా ప్రతి ప్రదర్శనకు రూ.18వేలు పారితోషికాన్ని, జ్ఞాపికను అందజేశారు. అంతేగాకుండా మహిళా కళాకారిణులకు ఆడపడుచు లాంచనాలుగా బట్టలు, పసుపు, కుంకుమ అందించి సత్కరించారు. ఈ సందర్భంగా కళానిలయం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు గ్రామంలో ఎల్‌వీఆర్ కంటి ఆసుపత్రి సహకారంతో యడ్లపాడులో ఐ క్లినిక్ ఏర్పాటుచేసి ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు ప్రకటించారు. అందుకు అయ్యే ఖర్చు తానే భరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళానిలయం కార్యదర్శి ముత్తవరపు రామారావు, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షులు ఆలోకం అబ్బయ్య, కళానిలయం ఉపాధ్యక్షులు జరుగుల శంకరం, తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక)లోని పరిషత్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.



జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం

కన్న కొడుకు ఆచూకీ తెలియక ఓతల్లి చెందే ఆవేదన, పోరాటమే 'జనరల్ బోగీలు'

రైలు ప్రమాదం జరిగినప్పుడు జనరల్ భోగీలలో ఉన్న ప్రయాణికుల గురించి ఎవరూ పట్టించుకోరు. మరణించినా వారి వివరాలు రైల్వేశాఖ వద్ద ఉండనందున వారి వివరాలు తెలియక బంధువులు పడే ఆవేదన, ఆందోళన వర్ణనాతీతం. ఒక రైలు ప్రమాద సమయంలో జనరల్ భోగీలో ప్రయాణిస్తున్న తన కుమారుడి ఆచూకీ తెలియక ఒక తల్లి అనుభవించే ఆవేదనను, పోరాటాన్ని తెలిపేది 'జనరల్ భోగీలు నాటిక. కొడుకు ఆచూకీ కోసం ఓ తల్లి చేసిన అసమాన్య పోరాటాన్ని, వ్యవస్థలోని రుగ్మతలను ఎత్తి చూపుతూ ఎంతో సందేశాత్మకంగా సాగిన ఈ నాటికను సాయి ఆర్ట్స్ కొలకలూరు వారు ప్రదర్శించగా, పీటీ మాధవ్ రచన, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

శృతిమించిన టెక్నాలజీనే 'నా శత్రువు'

నేడు మనిషి జీవితం టెక్నాలజీతో ముడిపడిపోయింది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, సోషల్ మీడియాలో గంటల తరబడి గడుపుతున్నారు. బంధాలకు, అనుబంధాలకు దూరమై ఒంటరిగా మిగిలిపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వినియోగిస్తే దానికి మించిన మిత్రుడు మరొకరు ఉండరని, మించితే జీవితంలో ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని తెలియజేసే సందేశాత్మక నాటిక 'నా శత్రువు'. జయభేరి ఆర్ట్స్, హైదరాబాద్‌వారు సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వడ్డాది సత్యన్నారాయణ దర్శకత్వం వహించారు.

కుటుంబ బంధాల్ని తెలియజెప్పిన 'ఋతువులేని కాలం'

వర్తమానంలో ఆడపిల్లలు భర్త కావాలి, అతనికి తల్లిదండ్రులు, తోబుట్టువులు ఉండకూడదు. అలాంటి వ్యక్తి దొరికేవరకు పెళ్ళికూడా చేసుకోవడం లేదు. వీరి దృష్టిలో అత్త, ఆడబిడ్డలు శతృవులు, రాక్షసులు. తీసుకోవడమే తప్ప ఇచ్చే గుణం లేని వ్యక్తిత్వం. వస్తువులపై వ్యామోహం తప్ప జీవితంపైన, బంధాలపైన ప్రేమలేదు. విలాసాలు, ఫ్యాషన్లకు బానిసలై భర్త, పిల్లలకు దూరమై ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. అలాంటి వారికి కుటుంబ బంధాలు, వాటి విలువల్ని తెలియచేసేదే 'ఋతువులేని కాలం' నాటిక. కళానికేతన్, వీరన్నపాలెం వారు ప్రదర్శించిన ఈ నాటికను శ్రీఅగస్త్య రచించగా వైబి చౌదరి దర్శకత్వం వహించారు.

నైతిక విలువలులేని యువకుడికి గుణపాఠం నేర్పిన 'గురితప్పిన వేట'

నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి అడ్డదారులను ఆశ్రయించిన ఓ యువకుడు చేసే ప్రయత్నాన్ని ఎలా అడ్డుకుంది అన్న విషయాన్ని ఆసక్తికరమైన సంఘటనలతో ఆలోచన రేకెత్తించే విధంగా సందేశాత్మకంగా సాగిన నాటిక 'గురితప్పిన వేట'. రసఝురి, పొన్నూరు వారు ప్రదర్శించిన ఈ నాటికను పి మృత్యుంజయరావు రచించగా, వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించారు.



నా శత్రువు నాటికలోని సన్నివేశం

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కలెక్టర్

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో ఈ నెల 7న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు పీజీఆర్ఎస్ ప్రారంభమవుతుందన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తూ, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించదలిచామన్నారు. అందులో భాగంగా తొలిసారిగా చిలకలూరిపేట నియోజకవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులతో కలిసి చిలకలూరిపేటలో ఫిర్యాదులు స్వీకరిస్తారని, అదే సమయంలో కలెక్టరేట్‌లో సైతం ఫిర్యాదులు స్వీకరించేందుకు ఒక అధికారి అందుబాటులో ఉంటారన్నారు.

దేవాలయం నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటబజార్ పులుపుల వారి వీధిలో ఉన్న శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ రాతి నిర్మాణానికి పట్టణానికి చెందిన జగదీష్‌కుమార్ రంజిత దంపతులు రూ.లక్షా 116ను విరాళంగా కమిటీ సభ్యులు అందజేశారు. అశ్వినికుమార్ అనూష, అభిరామ్, అనిరుద్‌లు రూ.2,01116లను కమిటీ సభ్యులకు శనివారం విరాళంగా అందజేశారు.

గడ్డి వామి దగ్ధం

నూజెండ్ల, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పోరం సీతారామరాజు, గుండాల మస్తానమ్మకు చెందిన పదెకరాల గడ్డి వామి, నూజెండ్ల మోడల్ పాఠశాల పరిసరాల్లోని ఎండు గడ్డి దగ్ధమైన ఘటనలు శనివారం జరిగాయి. రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదాన్ని గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

8న ఆయుర్వేద వైద్యశిబిరం

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్థానిక రాధాకృష్ణ ఆయుర్వేద ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచితంగా ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో ఆరుగురు ఆయుర్వేద వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

విజిబుల్ పోలీసింగ్ తనిఖీలు

● 40 ద్విచక్ర వాహనాలు సీజ్

వినుకొండటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వినుకొండ పట్టణంలోని సురేష్ మహల్ సమీపంలోని నరసరావుపేట రోడ్డు నందు నేరాలను అరికట్టడానికి శనివారం రాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు సూచన మేరకు రూరల్ సీఐ ప్రభాకర్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు షమీర్ బాషా, సత్యనారాయణ సిబ్బంది సాయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కార్యక్రమంలో బాగంగా మొత్తం 40 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలానే డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, ఓవర్ లోడింగ్ వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలను వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమాజంలో జరిగే వ్యక్తిగత, ఆర్థిక, భద్రతపరమైన నేరాలపై ప్రజల్లో అవగాహన కలిగిస్తూ ప్రతిరోజు సాయంత్రం ముఖ్యమైన కూడళ్లలో, ప్రజలతో రద్దీగా ఉండే ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

రైతుల సేవలో సొసైటీ

ఈపూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రైతులకు విలువైన సేవలు అందించడంలో ఈపూరు సొసైటీ ముందుంటుందని పర్సన్ ఇన్‌చార్జి సురేంద్రబాబు అన్నారు. ఈపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పరిధిలోని రైతులకు పంట రుణాలు, ఎరువులు, పురుగుమందులు, పాడి రైతులకు దాణా సరసమైన ధరలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సీఈవో కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రంగోత్సవ్‌లో కొత్త సొలస విద్యార్థుల ప్రతిభ

యడ్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం కొత్త సొలస ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రంగోత్సవ్ పోటీల్లో సత్తాచాటారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10న జరిగిన అంతర్జాతీయ రంగోత్సవ్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో పోటీపడి తమ ప్రతిభను చాటారు. గ్రీటింగ్ కార్డు, స్కెచింగ్, చేతిరాత, రంగులు దిద్దడం తదితర అంశాలలో ఏడు బహుమతులు సాధించారు. గ్రీటింగ్ కార్డు తయారీ పోటీల్లో సలికినీడి తాన్యా, సలికినీడి సుహాస్, గూడూరి అమూల్యలు ఏ గ్రేడ్ సాధించి ట్రోఫీలు కైవసం చేసుకున్నారన్నారు. కలరింగ్ పోటీల్లో మేడిద చైతన్య, విప్పర్ల వినయ్‌కుమార్ బీ ప్లస్ గ్రేడ్ సాధించి మెడల్స్‌ను గూడురు లోకేష్ బీ గ్రేడ్ సాధించి కన్సోలేషన్ బహుమతి సాధించాడు. కాగా చేతి రాత పోటీల్లో మేడిద ఇంద్రాని బీ ప్లస్ గ్రేడ్ సాధించి మెడల్‌ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్ఎం జున్నుసాహెబ్ తెలిపారు. వారందరికీ శనివారం పాఠశాలలో బహుమతులు అందజేసి అభినందించారు.

సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

నాదెండ్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండుగుంపాలెం సమీపంలో గల అక్కాయకుంట వద్ద ఉన్న శ్రీసువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి ఆకు పూజలు చేశారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నరసరావుపేట పట్టణంలో భారత దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఇతర అధికారులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పించారు.



కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కొమ్మాలపాటి శ్రీధర్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సాతులూరి కుమార్, కొట్టా కిరణ్, వేములపల్లి నరసయ్య, గొట్టిపాటి జనార్దన్‌బాబు, రాపర్ల జగ్గరావు, కుమ్మెత కోటిరెడ్డి, దాసరి ఉదయశ్రీ, ఆలీ బాషా తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● జనసేన అధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి సెంటర్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనంద్‌బాబు, దమ్మవళం కొండలు, వెంకట సుబ్బమ్మ, కిష్టంశెట్టి గోవిందరావు, గుప్తా శ్రీకాంత్, కృష్ణశెట్టి సిద్దయ్య, మల్లి తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పట్టణంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆపార్టీ నేతలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

● నరసరావుపేట లీగల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదరమెట్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరై జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్లో ఉన్న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు జగజీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నాదెండ్ల, (ఆంధ్రజ్యోతి): నాదెండ్లలో గల గ్రంథాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు, పలువురు విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.



చిలకలూరిపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి తదితరులు

వినుకొండలో..

వినుకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పార్టీ నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లెనిన్, సురేష్, నిశ్శంకరరావు శ్రీనివాసరావు, దాసయ్య, పెమ్మసాని నాగేశ్వరరావు, సంపెంగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన, కూటమి నాయకులు

● సీపీఐ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● కులవివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గూడూరి నవీన్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● వినుకొండ చర్చి ఆఫ్ క్రీస్ట్ సంస్థ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రావ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఈశ్వర్‌లో కియా మోటర్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలు

● 93 మంది విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ షేక్ మీరావలి తదితరులు

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సౌజన్యంతో కియా మోటర్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని ప్రిన్సిపాల్ జీ నాగమల్లేశ్వరరావు శనివారం తెలిపారు. ముందుగా కియా కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఉమాశంకర్ కంపెనీ విధివిధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాంగణ ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 323 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషన్ మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన లక్షల ఉద్యోగాల్లో భాగంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 93 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల చైర్మన్ షేక్ మీరావలి అన్నారు. తమ కళాశాలలో విద్యార్థులతో పాటు ఇతర కళాశాల విద్యార్థులకు కూడా ఉద్యోగాలు కల్పించడం ఆనందంగా ఉందని సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్ అన్నారు. కియా కంపెనీ ప్రాంగణ నియామకాలు నిర్వహించడానికి అవకాశం కల్పించిన ఏపీఐటీఏ డైరెక్టర్ సత్యరత్నం, డిస్ట్రిక్ కో- ఆర్డినేటర్ రోశిరెడ్డి, ఏపీఐటీఏ అకడమిక్ మేనేజర్ జనార్దన్‌కు కళాశాల ఎండీ మస్తాన్ షరీఫ్ ధన్యవాదాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్లేస్‌మెంట్ అధికారి అభినందించారు.

రావిపాడు నుంచి క్రైస్తవుల పాదయాత్ర



పాదయాత్రలో శిలువ మోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : ఈస్టర్ పండుగను పురస్కరించుకొని శిలువతో వందలాది మంది క్రైస్తవులు పాదయాత్ర చేశారు. నరసరావుపేట మండలంలోని రావిపాడు అమలోద్భవి మాత చర్చి నుంచి నాదెండ్ల మండలం కనపర్రులోని బాలయేసు చర్చి వరకు జరిగిన పాదయాత్రలో దైవజనులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పట్టణంలో శిలువ మోస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈస్టర్ సందర్భంగా పాదయాత్ర చేశారు.

కంటి వైద్యశిబిరంలో 628 మందికి పరీక్షలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని కోటలో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆస్పత్రిలో శనివారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్ట్, శంకర నేత్రాలయం సంయుక్తంగా నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ముందుగా కోడెల శివప్రసాదరావు, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వైద్యశిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ప్రారంభించారు. డాక్టర్ కే మహిత వైద్యసేవలు అందజేశారు. మొత్తం 628 మందికి వైద్య పరీక్షలు చేశారు. 214 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ మీరావలి, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎండీ మస్తాన్ షరీఫ్, మాజీ కౌన్సిలర్ నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

వినుకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని కళాకారులు పెద్దసంఖ్యలో పాల్గొని పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గుమ్మడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళ ఆదరణ లేక, ఉండటానికి కనీసం ఇల్లు లేక అనేక రకాల సమస్యలతో ఉన్న కళాకారులకు ప్రభుత్వం ద్వారా న్యాయం చేయాలన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

అనంతరం కళాకారులతో కలిసి నరసరావుపేట వెళ్లి కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

నాయీబ్రాహ్మణులకు చట్టసభల్లో అవకాశం కల్పించాలి

వినుకొండటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హయాంలో నాయీ బ్రాహ్మణులకు శాసనమండలిలో అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా వినుకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేస్తామని ఐదేళ్లపాటు తీవ్ర నిరాశకు గురి చేశారని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడున్నర దశాబ్దాలు దాటినప్పటికీ నాయీ బ్రాహ్మణులు ఓటు వేసే యంత్రాలుగా మిగిలిపోయారని ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని, అనాదిగా వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కుటుంబాలను కార్పొరేట్ ద్వారా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కొర్నెపాటి నరేష్, బ్రహ్మం, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు

మురళిని వరించిన యార్డు చైర్మన్ పదవి

వినుకొండటౌన్ ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా మీసాల మురళీకృష్ణయాదవ్‌ను నియమిస్తూ టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉగాది పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నామినేటెడ్ పదవులను ప్రకటించడంతో ఆపార్టీ శేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన మీసాల మురళీకృష్ణయాదవ్ టీడీపీ బలోపేతానికి అహర్నిశలు పనిచేస్తున్న నేపథ్యంలో ఆయన్ను నూజెండ్ల మండలం టీడీపీ మండల అధ్యక్షుడిగా జీవీ ఆంజనేయులు నియమించారు. పార్టీని కనిపెట్టుకుని పార్టీ కోసం పనిచేసిన మురళీ కృష్ణయాదవ్‌ను నూజెండ్ల మండలం నుంచీ మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించడంతో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన టీడీపీ

ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే వినుకొండ మార్కెట్ యార్డుకు ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాలకు అప్పట్లో ఏకైక మార్కెట్‌యార్డు వినుకొండ మార్కెట్ యార్డు ఒక్కటే. అప్పటి మార్కెట్ యార్డు చైర్మన్‌గా విఠంరాజుపల్లి గ్రామానికి చెందిన భవనం రామిరెడ్డి, పగడాల నారాయణరెడ్డిలు పనిచేశారు. తర్వాత కాలంలో వినుకొండ మార్కెట్ యార్డును వేరు చేసి నూజండ్ల మండలానికి చెందిన అమ్మిరెడ్డి అంజిరెడ్డిని నియమించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో నాగులవరం గ్రామానికి చెందిన మద్దుల వెంకటేశ్వరెడ్డి నియమించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో విఠంరాజుపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది చింతల చెరువు వెంకటరెడ్డి నియమించారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వినుకొండ మండలం చీకటీగలపాలెం గ్రామానికి చెందిన తుపాకుల కొండలరెడ్డితో పాటు, నూజెండ్ల మండలం సుబ్బారెడ్డి, వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామానికి చెందిన మాదినేని ఆంజనేయులు యార్డు చైర్మన్లుగా పనిచేశారు. వైసీపీ అధికారంలోకి రావడంతో గంధం బాలరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు చైర్మన్లుగా పనిచేశారు. ప్రస్తుతం మురళీ కృష్ణ యాదవ్‌ను చైర్మన్ పదవి వరించడంతో బీసీ నేతలు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు మెచ్చేలా పనులు నిర్వహించండి

● రూ.6.15 కోట్లతో నిర్మిస్తున్న బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట పనుల పరిశీలన : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు మెచ్చేలా, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. రూ.6.15కోట్లతో నిర్మిస్తున్న బోయపాలెం-చెంఘీజ్‌ఖాన్‌పేట బీటీ రోడ్డు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను ఎమెల్యే శనివారం పరిశీలించి ఆర్అండ్‌బీ అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి నాణ్యతాపరమైన లోపాలు రాకుండా చూసుకోవాలని అన్నారు. బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వరకు వేస్తున్న బీటీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణంతో పలు గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలు తీరనున్నాయన్నారు. గత ప్రభుత్వం ప్రధాన రహదారులతో సహా గ్రామీణ రోడ్లను గుంతలమయం చేసిందని, ప్రజల ప్రాణాలు పోతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విప్రో ఐటీ కంపెనీకి కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విప్రో ఐటీ కంపెనీ ఈ ఎడాది ఫిబ్రవరి 9న క్యాంపస్ ఆన్‌లైన్ ఎగ్జామ్ నిర్వహించిందన్నారు. తదనంతరం ఏ ఎగ్జామ్‌లో ఎంపికైన వారికి ఫిబ్రవరి 16న కమ్యూనికేషన్ లాంగ్వేజ్‌పై ఎగ్జామ్ నిర్వహించారు. ఫైనల్ రౌండ్ మార్చి 28న టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్లు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విప్రో ఐటీ కంపెనీకి ఎంపికయ్యారన్నారు. వారిని టీపీవో బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలి

● విశ్వతేజ నూలు మిల్లు ఎండీ చంద్రశేఖర్

యడ్లపాడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రక్తదానం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని విశ్వతేజ స్పిన్నింగ్ మిల్స్ ఎండీ దాసరి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బోయపాలెం పరిధిలో గల విశ్వతేజ స్పిన్నింగ్ మిల్లులో రక్తదాన శిబిరాన్ని శనవారం నిర్వహించారు. విశ్వతేజ మిల్లు యాజమాన్యం సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో మిల్లు ఎండీతోపాటు పలువురు మిల్లు సిబ్బంది, కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కో-ఆర్డినేటర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోయినవి

జిల్లెల రామిరెడ్డి S/o సుబ్బారెడ్డి, నెహ్రూనగర్ మాచర్ల మండలం మరియు గ్రామం చిలకలూరిపేట సబ్ రిజిస్టర్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన దస్తావేజు నెం. 11734/2011 దాని తాలూకా లింకు డాక్యుమెంట్ నెం. 4636/1996 చిలకలూరిపేట ఎస్.ఆర్.టి సెంటర్‌లో పోయినది. దొరికిన వారు తెలియజేయగలరు

సెల్ : 7702283860